క్లుప్తంగా...

శంషాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా కృష్ణప్రియ



శంషాబాద్: శంషాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా కృష్ణప్రియ నియామకమయ్యారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బదిలీలు చేపట్టారు. ఇందులోభాగంగా ఇంతకుముందు ఇక్కడ విధులు నిర్వహించిన సత్యనారాయణ జగిత్యాలకు బదిలీ కాగా, ఆయన స్థానంలో జనగామలో పనిచేసిన ఎస్. కృష్ణప్రియ ఇక్కడికి వచ్చారు.

ప్రజావాణికి ఐదు ఫిర్యాదులు



రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఐదు ఫిర్యాదులు అందాయని ఉప కమిషనర్ రవి కుమార్ తెలిపారు. ఫిర్యాదులను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, శుక్రవారంలోగా పరిష్కరించాలని ఆదేశించామన్నారు. నిధులతో ముడిపడి ఉంటే సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈఈ నరేందర్, ఏసీపీ కృష్ణ మోహన్, డీపీఓ రాధారాణి, మేనేజర్ ప్రసన్న కుమార్, పద్మావతి, జయప్రకాశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 16న గర్భగుడికి శంకుస్థాపన

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ బుద్వేల్ గ్రామంలోని శ్రీ రాధాకృష్ణ శ్రీ సీతారామ సమేత శ్రీ కుసుమ హరనాథ బాబా మందిరంలో ఈ నెల 16న గర్భగుడికి శంకుస్థాపన చేయనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 9.30 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ హంపీ విరుపాక్ష విద్యారణ్య భారతీ స్వామిజీ పాల్గొని ప్రారంభిస్తారని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

ముగిసిన కమ్యూనిటీ సైన్స్‌పై శిక్షణ



శిక్షణ ముగింపులో పాల్గొన్న శాస్త్రవేత్తలు, అధికారులు

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో కాటేజ్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్‌పై మూడు వారాల పాటు కొనసాగిన శిక్షణ సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ వెంకటరమణ మాట్లాడుతూ వాల్యూ చైన్‌పై మల్టీడిసిప్లినరీ విధానం ఉండాలని భవిష్యత్‌లో సహకారానికి అవకాశాలను అన్వేసించేందుకు ఇంటర్ ఇన్‌స్టిట్యూట్‌ల అనుసంధానాలను అభివృద్ధి చేయాలని, ఇందుకోసం ప్రభుత్వ , ప్రైవేట్ భాగస్వామ్యం ఉండాలన్నారు. ప్రభుత్వ రంగాలు గృహ ఆధారిత విలువ గొలుసులను అభివృద్ధి చేయడంపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం కమ్యూనిటీ సైన్స్ డీన్ డాక్టర్ వి విజయలక్ష్మి పోషకాహార లోపం లేకుండా ఆహార ఉత్పత్తి ప్రాసెసింగ్ యొక్క ప్రాముఖ్యతపై మాట్లాడారు. సూక్ష్మ లోపాలను తగ్గించడం, పోషకాహారం అధికంగా ఉంటే ఆహార వినియోగంపై కోర్సు డైరెక్టర్ టీ కమల శిక్షణ నివేదికను సమర్పించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, కమ్యూనిటీ సైన్స్ విభాగానికి చెందిన అధికారులు , ఐసీఏఆర్, ఎస్ఏయూ, కోర్సు సమన్వయకర్తలు శ్వేత కొడాలి, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

డాక్టర్ అదృశ్యం



డాక్టర్ శిరీషా రెడ్డి

గచ్చిబౌలి: హాస్టల్ నుంచి బయటకు వెళ్లిన డాక్టర్ అదృశ్యమైన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్ఐ సాయులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కడప జిల్లాకు చెందిన డాక్టర్ కె.శిరీషారెడ్డి(25) ఓ కార్పొరేట్ హాస్పిటల్‌లో జనరల్ ఫిజీషియన్‌గా చేస్తోంది. ఆదివారం రాత్రి 8.45 గంటల సమయంలో స్నేహితుడు సాయికి ఫోన్ చేసి నేను వెళ్లిపోతున్నాను. అని చెప్పి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసింది. అప్పటి నుంచి ఆచూకీ తెలియకపోవడంతో బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా శిరీషకు ఆర్థిక ఇబ్బందులు ఉన్నట్లుగా తెలిసిందని పోలీసులు తెలిపారు.

చెత్తరహిత దిశగా..

- జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ సర్కిల్‌లో స్పెషల్ డ్రైవ్
- బహిరంగా ప్రదేశాలు, రోడ్లకిరు వైపులా డంప్ లేకుండా చర్యలు
- రుసుం చెల్లిస్తే బల్దియా వాహనాల్లోనే ఇండ్ల నిర్మాణ వ్యర్థాలు తరలించేలా ఏర్పాట్లు



మీరాలం ట్యాంక్ వద్ద రాత్రి సమయంలో డ్యూటీ నిర్వహిస్తున్న సిబ్బంది



రాజేంద్రనగర్ సర్కిల్‌లో డంప్ చేసిన మట్టి కుప్పలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్‌ను చెత్త రహితంగా మార్చేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ఇంటి నిర్మాణ వ్యర్థాలు, చెత్తాచెదారాలను బహిరంగ ప్రదేశాలు, రోడ్లకిరువైపులా డంప్ చేయకుండా స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నారు. ప్రధానంగా రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు డంప్ చేస్తుండడంతో ఉప కమిషనర్ రవి కుమార్ ఆధ్వర్యంలో జీహెచ్‌ఎంసీతో పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది నైట్ పెట్రోలింగ్‌ను చేపడుతున్నారు. రాజేంద్రనగర్, సులేమాన్‌నగర్, శాస్త్రిపురం, మైలార్‌దేవ్‌పల్లి, అత్తాపూర్ డివిజన్ల పరిధిలో ఈ డ్రైవ్ కొనసాగుతున్నది.

మూసి పరీవాహక ప్రాంతాలు, ఖాళీ ప్రదేశాలు, రోడ్లకిరువైపులా రాత్రుల్లో కొందరు వాహనాల్లో వ్యర్థాలను తీసుకొచ్చి పడేస్తున్నారు. దీంతో వీటిని తొలగించేందుకు జీహెచ్‌ఎంసీ సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు. వీటిని దృష్టిలో పెట్టుకొని ఉప కమిషనర్ స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నారు. ఈ సందర్భంగా పట్టుబడిన వాహనాలకు భారీ జరిమానాను సైతం విధిస్తున్నారు.

జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో సేకరణ..

జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ఇంటి నిర్మాణ వ్యర్థాల తరలింపునకు చర్యలు చేపట్టామని ఉప కమిషనర్ తెలిపారు. జీహెచ్‌ఎంసీకి ప్రతి టన్నుకు రూ.405 రుసుం చెల్లిస్తే తమ సిబ్బంది వ్యర్థాలను వాహనంలో తీసుకెళ్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని సర్కిల్ పరిధిలోని ఐదు డివిజన్ల ప్రజలు వినియోగించుకోవాలని సూచిస్తున్నారు.

డంప్ చేస్తే భారీ జరిమానా..

సర్కిల్ పరిధిలో ఇంటి నిర్మాణ వ్యర్థాలతో పాటు ఇతర వాటిని బహిరంగ ప్రదేశాలు, రోడ్లు, ఖాళీ ప్రదేశాల్లో డంప్ చేస్తే ఉప కమిషనర్ భారీ జరిమానా విధిస్తున్నారు. మొదటి సారి పట్టుబడితే రూ.25 వేలు, రెండోసారి రూ.50 వేలు, మూడోసారి పట్టుబడితే రూ. లక్ష జరిమానాతో పాటు వాహనాన్ని సీజ్ చేస్తున్నారు. అంతేగాకుండా క్రిమినల్ కేసులు సైతం నమోదు చేస్తామని ఆయన హెచ్చరిస్తున్నారు.

ప్రజలు సహకరించాలి..

రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో జీహెచ్‌ఎంసీ సిబ్బంది, అధికారులు చేపడుతున్న అభివృద్ధి పనులకు ప్రజలు సహకరించాలి. తమ ప్రాంతంలో చెత్తాచెదారాన్ని డంప్ చేయకుండా చూడాలి. ఎవరైనా డంప్ చేస్తే వారి వివరాలను జీహెచ్‌ఎంసీ సిబ్బందికి అందించాలి. పారిశుధ్య విభాగం అధికారులు, సిబ్బంది ప్రతిరోజు పనులు చేపట్టి పరిసరాలను శుభ్రంగా ఉంచుతున్నారు.

–రవికుమార్, ఉప కమిషనర్

ఎగ్జిబిషన్‌కు అనూహ్య స్పందన



కొండపల్లి బొమ్మలను కొనుగోలు చేస్తున్న ప్రజలు



డ్రస్ మెటీరియల్‌ను కొనుగోలు చేస్తున్న ప్రజలు

మణికొండ: దేశవ్యాప్తంగా చేతివృత్తుల వారు తయారు చేసిన దుస్తులు, గృహోపకరణ వస్తువుల ఎగ్జిబిషన్‌కు అనూహ్య స్పందన వస్తున్నది. పైప్‌లైన్ రోడ్డులో సుందర్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఆల్ ఇండియా హ్యాండ్లూమ్స్, హ్యాండీ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్, సేల్ జనవరి 26వ తేదీ నుంచి కొనసాగుతున్నది. ఇందులో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, డిజైనర్, కాంతా వర్క్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్ లెనిన్, కలంకారి, బెంగాల్ కాటన్ చీరలతో పాటు డ్రెస్ మెటీరియల్, డిజైనర్ బ్లౌస్‌లు, ఖాదీ మెటీరియల్, వన్ గ్రాం గోల్డ్ జ్యువెల్లరీ, జైపూర్ బెడ్‌షీట్, కొండపల్లి బొమ్మలు, పర్సులు, గృహోపకరణ వస్తువులను విక్రయిస్తున్నారు. అనేక రాష్ట్రాల్లోని చేతివృత్తుల వారు తయారు చేసిన వస్తువులన్నీ ఒకే చోట నాణ్యతతో లభిస్తుండడంతో కొనుగోలుదారులు ఆదరిస్తున్నారని నిర్వాహకులు తెలిపారు. మరికొన్ని రోజులు మాత్రమే ఎగ్జిబిషన్ ఉంటుందని, అన్ని రకాల బ్యాంకు కార్డులను అనుమతిస్తామని వారు పేర్కొన్నారు.

నూనె గింజల పరిశోధనా సంస్థ ఆధ్వర్యంలో సమావేశం



నూతనంగా రూపొందించిన నూనె గింజలను పరిశీలిస్తున్న సంస్థల ప్రతినిధులు

ఏజీవర్సిటీ: భారతీయ నూనె గింజల పరిశోధనా సంస్థ ఆధ్వర్యంలో నూనె గింజల సంస్థలు, వ్యవసాయ అగ్రి పరిశ్రమల ప్రతినిధులతో సమన్వయ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు నూతన వంగడాలు, కొత్త రకాల జీవ సంబంధిత క్రిమీ సంహారకాలు, వాటి ఉత్పత్తిలో పరిశ్రమలను భాగస్వాములను చేయడమే ఈ కార్యక్రమ ఉద్దేశమని ప్రతినిధులు తెలిపారు. ఆముదాం, ఆవాలు, సోయాచిక్కుడు, పొద్దు తిరుగుడు, కుసుమలు, వేరుశనగ, అవిసెలు, నువ్వుల పంటల్లో నూతనంగా అభివృద్ధి చేసిన సాంకేతికతను ప్రదర్శించారు. ఐసీఏఆర్ నూనె గింజల పరిశోధనా సంస్థ డైరెక్టర్ ఆర్.కే మాత్రు తమ సంస్థ సాంకేతికతను వివరించారు. అలాగే వివిధ నూనె గింజల పంటల శాస్త్రవేత్తలు విడివిడిగా సమావేశమై భవిష్యత్ ప్రణాళికలపై చర్చించుకున్నారు. సమావేశంలో 30 పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఐసీఏఆర్ ఏడీ సంజయ్ గుప్తా, వివిధ నూనె గింజల సంస్థల డైరెక్టర్లు, ప్రతినిధులు, వివిధ వ్యవసాయ వర్సిటీల శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

రసవత్తరంగా 'బండ్లగూడ' రాజకీయం

- 16న మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ అవిశ్వాసంపై సమావేశం
- పోటాపోటీగా సమీకరణలు
- గెలుపుపై ఎవరీ ధీమా.. వారిదే



బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో రాజకీయలు రసవత్తరంగా మారుతున్నాయి. గత నెల 12న 16 మంది కార్పొరేటర్లు మేయర్ మహేందర్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడుతూ కలెక్టర్‌కు లేఖ సమర్పించగా, ఈ నెల 16న బలనిరూపణకు కలెక్టర్ అవకాశం కల్పించారు. దీంతో సమయం దగ్గర పడుతుండడంతో కార్పొరేషన్ పరిధిలో ఏ నలుగురు కలిసినా.. ఇదే విషయమై చర్చించుకోవడం కనిపిస్తోంది.

కోట్ల ఆశలు చూపి ఆకర్షిస్తున్నారు..

కార్పొరేటర్లను తమ వైపు తిప్పుకునేందుకు ఎం అడిగినా..? ఎంత డిమాండ్ చేసినా.. ఇచ్చి తమ బలాన్ని పెంచుకునేందుకు ఇరువర్గాలు పావులు కదుపుతున్నట్లు స్థానికులు గుసగుసలాడుతున్నారు. ఎవరి బలం ఎక్కువ ఉంటే వారి పక్షానే గెలుపు ఉండడంతో ఇరువర్గాలు పోటాపోటీగా సమీకరణలు చేస్తున్నాయి.

అవిశ్వాస తీర్మానం నెగ్గుతాం : కార్పొరేటర్లు

బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్‌పై అవిశ్వాస తీర్మానం నెగ్గి తీరుతామని వివిధ డివిజన్ల కార్పొరేటర్లు ధీమా వ్యక్తం చేస్తున్నారు. తీర్మానం పెట్టినప్పటి నుంచి నెల రోజులుగా పార్టీలకు అతీతంగా 16 మంది కార్పొరేటర్లు క్యాంపులోనే కొనసాగుతున్నారు. వారు నేరుగా బల నిరూపణ రోజే బయటకు వచ్చి అవిశ్వాసాన్ని నెగ్గించుకుంటామని కార్పొరేటర్లు పేర్కొంటున్నారు.

ట్రక్కును ఢీ కొట్టి యువకుడి మృతి



ఫకీర్ సాబేర్(ఫైల్)

గచ్చిబౌలి: బైక్ అదుపు తప్పి ట్రక్‌ను ఢీ కొట్టిన యువకుడు మృతి చెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గౌలిదొడ్డిలో నివాసం ఉండె ఫకీర్ సాబేర్(22), అతని స్నేహితుడు సాయి కలిసి డిస్కవరీ బైక్‌పై గౌలిదొడ్డి నుంచి నానక్‌రాంగూడ వైపు వెళుతున్నారు. సోమవారం ఉదయం 8 గంటల సమయంలో క్యూ సిటీ వద్ద రోడ్డుపై ఉన్న జీహెచ్‌ఎంసీ శానిటేషన్ వాహనాన్ని వెనక నుంచి ఢీ కొట్టాడు. దీంతో తలకు తీవ్రగాయాలు కావడంతో సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే ఫకీర్ సాబేర్ మృతి చెందినట్లుగా డాక్టర్లు ధ్రువీకరించారు. సాయి తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతదేహానికి ఉస్మానియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేశారు.

ఘనంగా మార్కండేయ స్వామి జయంతి



మార్కండేయ జయంతిలో పాల్గొన్న పద్మశాలీ సంఘం సభ్యులు

శంషాబాద్: పట్టణంలోని పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో మార్కేండేయ స్వామి జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూజలు చేశారు. కార్యక్రమంలో పులిపాటి పాండు, కాశీగారి ఆంజనేయులు, వర్కల శ్రీరాములు, వీరేశం, పాపని వెంకటేశ్, నగేశ్, సత్యం, పుంజల మహేశ్‌కుమార్, వెంకటేశ్, రవి, విజయ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీ ట్రస్ట్ భవనంలో ..



వేడుకల్లో పాల్గొన్న పద్మశాలీ సంఘం నేతలు

మైలార్‌దేవ్‌పల్లి: పద్మశాలీల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని భవనరుషి పొదుపు సంఘం అధ్యక్షుడు ఏర్వ సత్యనారాయణ అన్నారు. ఆదర్శనగర్‌లోని పద్మశాలీ సంఘం ట్రస్ట్ భవనంలో మార్కండేయ జయంతిని సంఘం సభ్యులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యేటా కులస్తులు మార్కండేయ జయంతిని తప్పనిసరిగా జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం చైర్మన్ కాశిగారి యాదగిరి , బాస శ్రీనివాస్, కొంపల్లి జగదీశ్ , బాస శ్రీనివాస్, సిద్ధిరాల రాజ్ కుమార్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వై. శ్రీధర్, జి.బాబురావు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని రంగారెడ్డి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు జి.బాబురావు అన్నారు. ఈ మేరకు సోమవారం జోనల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కొన్నేళ్లుగా రాజేంద్రనగర్‌లో రెండు గ్రూపులు పని చేస్తూ ఉండేవని, అయితే ఇప్పుడు జనాభా పెరిగి ఏరియా మొత్తం వీఐపీ జోన్‌గా మారిపోయిందన్నారు. మండల్, అసెంబ్లీ హెడ్ క్వార్టర్స్ కూడా ఇక్కడే ఉన్నా.. సిబ్బంది మాత్రం పెరగలేదన్నారు. అదే సిబ్బందితో శానిటేషన్ పనులు చేయిస్తున్నారన్నారు. అంతేగాకుండా ఒక గ్రూపును చింతల్‌మేట్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారన్నారు. కేవలం మెయిన్‌రోడ్లను మాత్రమే శుభ్రం చేస్తున్నారని, దీంతో వీధుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారంతో దుర్వాసన వస్తుందన్నారు. అంతేగాకుండా డివిజన్‌లో వీధి దీపాలు సరిగా వెలగడం లేదని, వాటికి కూడా మరమ్మతులు చేయాలని కోరారు. డివిజన్‌ను ఎమ్మెల్యేగా గానీ.. అభివృద్ధి కోసం పార్టీ మారిన కార్పొరేటర్ గానీ పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి



అవగాహన, శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

అత్తాపూర్: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో పాలుపంచుకొని రాణించినప్పుడే విజ్ఞానవంతులుగా ఎదుగుతారని మహవీర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల కార్యదర్శి సంరెడ్డి సురేందర్ రెడ్డి పేర్కొన్నారు. మెకానికల్ ఇంజినీరింగ్ బీటెక్ డిప్లొమా చివరి సంవత్సరం విద్యార్థులకు డూక్లో ఎయిర్ సిస్టమ్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ప్రత్యేకంగా యంత్రాల పనితీరుపై రెండు రోజుల అవగాహన, శిక్షణను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఫీల్డ్ విజిట్ ద్వారా అనుభవంతో పాటు మంచి ఉద్యోగాలను కంపెనీల్లో పొందేందుకు ఉపయోగపడుతాయన్నారు. విద్యార్థులు వస్తువుల ఉత్పత్తితో పాటు కంపెనీలు తాము వ్యర్థాలకు పర్యావరణ పరిరక్షణకు చేపడుతున్న చర్యలు కూడా గమనించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల జాయింట్ సెక్రటరీ సంరెడ్డి ధనుంజయ్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఉషశ్రీ, మెకానికల్ హెచ్ఓడీ బి.వెంకటేశ్వర్ రెడ్డి, డాక్టర్ వి.వి.ప్రతిభా భారతి, కృష్ణదీపక్, జి.రమేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

నిథమ్ విద్యార్థినులకు ప్రతిష్టాత్మక ఫెలోషిప్



రాయదుర్గం: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజమ్ అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్(నిథమ్) విద్యార్థినులు అంతర్జాతీయ ఫెలోషిప్‌కు ఎంపికయ్యారు. నిథమ్‌లో బీబీఏ చదువుతున్న సాయిరష్మిత, సుష్మలు యూరోపియన్ యూనియన్ ఎరాస్మస్ ప్లస్ ఫెలోషిప్ లభించింది. లాట్వియాలోని విడ్జమ్ యూనివర్సిటీ ఆఫ్ అప్లైడ్ సైన్సెస్‌లో టూరిజమ్, హాస్పిటాలిటీ కోర్సును అభ్యసించడానికి ఈ ఫెలోషిప్‌ను పొందారు.

అభినందించిన మంత్రి కృష్ణారావు

నిథమ్ విద్యార్థినులను పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్‌లు సోమవారం అభినందించారు. నిథమ్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ కె నిఖిల, నిథమ్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్, కోఆర్డినేటర్ డాక్టర్ మహేందర్‌రెడ్డితో కలిసి మంత్రి, కార్యదర్శిని కలిశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు, కార్యదర్శి శైలజారామయ్యర్ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో నిథమ్‌కు మరింత పేరు వచ్చేలా చేయాలని సూచించారు.

బండ్లగూడ కమిషనర్‌కు అదనపు బాధ్యతలు



బాధ్యతలు స్వీకరిస్తున్న శరత్‌చంద్ర

మణికొండ: నార్సింగి మున్సిపల్ కమిషనర్ బి. సురేందర్‌రెడ్డి మార్చి 3వ తేదీ వరకు సెలవుపై వెళ్లడంతో ఆయన స్థానంలో బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి. శరత్‌చంద్రకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. దీంతో నార్సింగి మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఆయనకు నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ డి. రేఖాయాదగిరి, వైస్ చైర్మన్ జి.వెంకటేశ్‌యాదవ్, కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు.

జాతీయస్థాయి కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



శంషాబాద్: ఉత్తర్‌ప్రదేశ్‌లోని మధురలో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో శంషాబాద్ ఆర్‌బీనగర్ శిక్షణ కేంద్రం విద్యార్థులు ప్రతిభ చూపారు. కోచ్ భగవాన్ దాస్ ఆధ్వర్యంలో వీరు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన విద్యార్థులు హర్షిత్ కుమార్‌రెడ్డి, హెత్విశ్రీ, హరిదీప్, విశాల్, సర్వేశ్‌సాయి, మోహిత్, మురళీధర్, అర్జున్ కార్తికేయ, విష్ణువర్ధన్, గౌస్, రఘువీర్, తరుణ్, సాయితేజ, అవినాశ్‌గౌడ్‌ను రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, కౌన్సిలర్ పుష్పలత బుచ్చిరెడ్డి, ఆర్‌బీనగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు నరేందర్‌గౌడ్ సోమవారం అభినందించారు.

ఈ నెల 16 నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు

రాజేంద్రనగర్: రాజేంద్రగర్ సర్కిల్ ఉప్పర్‌పల్లిలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఏకాదశి, 11వ వార్షిక బ్రహ్మోత్సవాలను ఈ నెల 16, 17వ తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ వ్యవస్థాపకుడు, ధర్మకర్త సామ యమునా భూపాల్ రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 16న శుక్రవారం ఉదయం సుప్రభాత సేవ, విష్వక్సేన పూజ, అభిషేకం, నీరాజన మంత్రిపుష్పం, సాయంత్రం 6 గంటలకు రుత్వీకరణం, రక్షాబంధనం, అగ్ని ప్రతిష్ట, ధ్వజారోహణం, ఈ నెల 17న ఉదయం అర్చన, సహస్ర నామార్చన, ఎదుర్కోలు ఉత్సవం, శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణం, అన్నదానం, స్వామి వారి ఉత్సవమూర్తుల ఊరేగింపు తదితర పూజ కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

వాహనం ఢీకొని వృద్ధుడికి గాయాలు



మణికొండ: నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఖానాపూర్ గ్రామంలో గల ప్రధాన రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్న గుర్తు తెలియని వృద్ధుడిని వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో చికిత్స కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. వృద్ధుడు వయస్సు 65 ఏళ్ల వరకు ఉంటుందని, అతనికి సంబంధించిన వారు ఉంటే పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

కార్మికుడి హత్య కేసులో ఇద్దరి అరెస్ట్

శంషాబాద్: కార్మికుడిని హత్యచేసిన ముగ్గురు నిందితుల్లో ఇద్దరిని ఆర్‌జీఐఏ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. ఈ నెల 9 రాత్రి లియో లామినేటెడ్ కంపెనీ వద్ద అందులోనే నివాసముంటున్న విజయబహదూర్ (52)కు అక్కడే ఉన్న సెక్యూరిటీ గార్డు నిత్యానంద్ మధ్య వాగ్వాదం జరిగింది. నిత్యానంద్ స్నేహితులైన చోటుకుమార్‌రే, గోలుకుమార్ యాదవ్ కూరగాయలు కోసే కత్తితో గొంతులో పొడవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అనంతరం పరారైన నిందితులను సోమవారం ఉదయం మైలార్‌దేవ్‌పల్లిలోని మహేశ్వరీ ఆయిల్ మిల్ వద్ద పోలీసులు పట్టుకొని రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువత రాజకీయాల్లోకి రావాలి




ఎన్ఎస్‌యూఐ విద్యార్థులతో కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

రాయదుర్గం: యువత రాజకీయాల్లోకి రావాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ సూచించారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో ఎన్ఎస్‌యూఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి సీఎం సునీల్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ నేటి తరం విద్యార్థులు రాజకీయాల గురించి, ఎన్ఎస్‌యూఐ పోరాట చరిత్ర గురించి తెలుసుకోవాలన్నారు. రాజకీయాల్లో విద్యార్థుల పాత్ర తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు ఆమోదించారు.

హెచ్‌సీయూ–ఎన్ఎస్‌యూఐ నూతన కార్యవర్గం

హెచ్‌సీయూ ఎన్ఎస్‌యూఐ విభాగం నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర ఎన్ఎస్‌యూఐ కార్యదర్శి సీఎం సునీల్‌కుమార్ ప్రకటించారు. హెచ్‌సీయూ ఎన్ఎస్‌యూఐ నూతన అధ్యక్షుడుగా నేహ జయరాజ్, ఉపాధ్యక్షులుగా పి.మాన్స్, దారం మహేష్, ప్రధాన కార్యదర్శులుగా ప్రభాకర్‌సింగ్, మహ్మద్ నద్రాన్ ఎంపిక అయ్యారు. వీరిని ఎమ్మెల్సీ వెంకట్, రాష్ట్ర కార్యదర్శి సీఎం సునీల్‌కుమార్ అభినందించారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల శ్రమదానం



రాయదుర్గం: ఐటీ ఉద్యోగులు పలుగుపార చేతబట్టారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని స్కైవ్యూ టవర్స్‌లోని డీబీఎస్ సాఫ్ట్‌వేర్ సంస్థ ఉద్యోగులు 150 మంది గోపన్‌పల్లి జర్నలిస్ట్ కాలనీలో సోమవారం శ్రమదానం చేశారు. యునైటెడ్ హైదరాబాద్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో స్థానిక పార్కులో చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. వారిని జర్నలిస్ట్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు అభినందించారు.